

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3 సిద్దిపేట
శనివారం 20 ఏప్రిల్ 2024



చిట్యాల @ 44.8 డిగ్రీలు

చేర్యాల, ఏప్రిల్ 19: రోజురోజుకూ ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి. చేర్యాల మండలం చిట్యాలలో శుక్రవారం జిల్లాలోనే అత్యధికంగా 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత, దూలిమిట్టలో 44.2 డిగ్రీలు నమోదైంది. ఇటీవల చేర్యాలలో 43 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. అక్కడక్కడా అకాల వర్షాలు కురుస్తున్నా ఉష్ణోగ్రతలు నానాటికి పెరిగిపోతుండడంతో జనం అల్లాడిపోతున్నారు.



ఇందిరమ్మ అడ్డా.. మెదక్ గడ్డ..

కష్ట కాలంలో గెలిపించిన మెతుకుసీమ


- హత్యకు గురయ్యేనాటికి మెదక్ ఎంపీగానే ఇందిరాగాంధీ
- ఇక్కడి నుంచే చివరిసారి ప్రాతినిధ్యం

జ్ఞాపకం

మెదక్, ఏప్రిల్ 19: దేశ ప్రధాని ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంగా మెదక్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. దేశమంతా కాంగ్రెస్‌కు ఎదురుగాలులు వీస్తున్న తరుణంలో ఇందిరాగాంధీని లోక్‌సభకు పంపించి దేశ వ్యాప్తంగా చర్చలో నిలిచింది. దేశంలో ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత 1977లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైంది. ఇందిరాగాంధీ కూడా రాయ్‌బరేలీలో జనతా కూటమి అభ్యర్థి రాజ్‌నారాయణ్ చేతిలో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించిన జనతా కూటమి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ పలు పార్టీల కలయికతో ఏర్పడిన జనతా ప్రభుత్వం ఆ తరువాత జరిగిన పరిణామాలతో కూలిపోయింది. దీంతో 1980లో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో ఇందిరాగాంధీ రాయ్‌బరేలీతో పాటు మరో సురక్షిత స్థానంలో పోటీ చేయాలని భావించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ కంచుకోటగా పేరున్న మెదక్ నియోజకవర్గంలోనూ పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఇక్కడ ఇందరకు పోటీగా మానవ కంప్యూటర్‌గా పేరున్న శకుంతలాదేవి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. జనతా పార్టీ తరఫున జైపాల్‌రెడ్డి, జనతా(సోషలిస్ట్ పార్టీ) అభ్యర్థిగా మానవహక్కుల ఉద్యమకారుడు కేశవ్‌రావ్ జాదవ్, పీవీ నరసింహారావు కుమారుడు పీవీ రాజేశ్వర్‌రావు తదితరులు మొత్తం పది మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. కాంగ్రెస్(ఐ) అభ్యర్థిగా పోటీలో ఉన్న ఇందిరాగాంధీకి ఎన్నికల ఏజెంటుగా ఓటమి ఎరుగని నేతగా పేరున్న మాజీ మంత్రి బాగారెడ్డి పనిచేశారు. ఇందిరాగాంధీ తొలిసారి దక్షిణ భారత దేశం నుంచి పోటీ చేస్తుండడంతో దేశ ప్రజలంతా ఆసక్తిగా గమనించారు.

అత్యధిక మెజారిటీ

ఈ ఎన్నికల్లో రాయ్‌బరేలీతో పాటు మెదక్ నియోజకవర్గంలోనూ ఇందిరాగాంధీ గెలుపొందారు. మెదక్‌లో 67.9 శాతం ఓట్లతో ఘన విజయం సాధించారు. ఆమెకు దేశంలోనే అత్యధిక మెజారిటీ వచ్చింది. ఇందిరకు 3,15,077 ఓట్లు రాగా.. సమీప ప్రత్యర్థి జైపాల్‌రెడ్డికి 82,483 ఓట్లు వచ్చాయి. కేశవ్‌రావ్ జాదవ్‌కు 26,147 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి శకుంతలాదేవికి కేవలం 6,514 ఓట్లు రావడంతో డిపాజిట్ కోల్పోయారు. అనంతరం ఇందిరాగాంధీ రాయ్‌బరేలీ స్థానానికి రాజీనామా చేసి, మెదక్ నుంచే పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు. దేశ ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తరువాత ఆమె పలుమార్లు మెదక్ నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులు కేటాయించారు. అప్పట్లో ఎద్దుమైలారంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని నెలకొల్పారు. మెదక్ పట్టణంలోని పటేల్‌కుంటలో నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు స్వయంగా శంకుస్థాపన చేశారు. హవేళీఘనపూర్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. 1984 అక్టోబరు 31న సిక్కు తీవ్రవాదుల చేతిలో హత్యకు గురయ్యేనాటికి ఇందిర మెదక్ పార్లమెంటు సభ్యురాలిగానే ఉన్నారు.



అభ్యర్థుల వ్యయాలను పకడ్బందీగా లెక్కించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్ రాజ్వన్సీ

సిద్దిపేట అగ్రికల్చర్ ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయాలను పకడ్బందీగా లెక్కించాలని మెదక్ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు సునీల్‌కుమార్ రాజ్వన్సీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం సందర్శించి ఎక్సైజ్, ఇన్‌కం ట్యాక్స్ అధికారులు, ఎన్నికల పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వేలైన్స్, ఎస్ఎస్‌టీ, తదితర నిఘా బృందాల ద్వారా సీజ్ చేసిన అక్రమ నగదు, లిక్కర్ వివరాలను తెలుసుకుని అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికలలో మద్యం, లిక్కర్ ప్రభావం చూపకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఎన్నికల సమయంలో నిర్వహించిన ర్యాలీలు, సభలు, సమావేశాల సందర్భంగా ఉపయోగించిన వస్తువులను వీడియో యు వింగ్ టీం ద్వారా గుర్తించి ఎన్నికల కమిషన్ చార్ట్ ప్రకారం వారి ఖాతాలో వ్యయాన్ని నమోదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌మూర్తి పలువురు పాల్గొన్నారు.

జహీరాబాద్‌కు మూడు, మెదక్‌కు నాలుగు నామినేషన్లు

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, ఏప్రిల్ 19 : రెండో రోజైన శుక్రవారం ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరూ నామినేషన్‌లను దాఖలు చేయలేదు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి మూడు నామినేషన్లు రాగా, మెదక్‌కు నాలుగు నామినేషన్లు వచ్చాయి. మెదక్ లోక్‌సభకు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ప్రజా వెలుగు పార్టీ నుంచి సారా యాదగిరి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి గొల్లపల్లి సాయిగౌడ్, స్వతంత్ర అభ్యర్థులుగా బొమ్మల విజయ్‌కుమార్, తుమ్మలపల్లి పృథ్వీరాజ్ తమ నామినేషన్ ప్రతాలను మెదక్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు సమర్పించారు. మెదక్ స్థానానికి తొలిరోజు వచ్చిన నాలుగు నామినేషన్లతో కలిపి మొత్తం ఎనిమిది దాఖలయ్యాయి.

సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో జహీరాబాద్ పార్లమెంట్‌కు స్వతంత్ర అభ్యర్థులు బి.మారుతిరావు, కే.ఆనందీశ్వర్ ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా, మహదేవ్‌స్వామి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మొదటి రోజున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున ఒక నామినేషన్ సెట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు జహీరాబాద్‌కు మొత్తం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంబంధించిన ఆస్తులు, అప్పులు, నేరచరిత్ర వివరాలను ఎప్పటికప్పుడు సంగారెడ్డి రిటర్నింగ్ అధికారి నోటీస్ బోర్డుపై ఉంచడంతో పాటు ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎవరైనా పూర్తి వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్ (ఎఫ్ఎఫ్ఐడీఏవీఐటీ.ఈసీఐ.జీవోవీ.ఇన్)లో చూడవచ్చని కలెక్టర్ క్రాంతి తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి గట్టి దెబ్బకొట్టాలి

- బీజేపీ, బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గ అభివృద్ధి శూన్యం
- కార్యకర్తల సన్నాహక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్


కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 19: పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ఏర్పాటును, అమరవీరుల త్యాగాలను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన ప్రధాని మోదీని ఈ ఎన్నికల్లో గట్టి దెబ్బకొట్టేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కష్టపడి పనిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో జరిగిన కాంగ్రెస్ హుస్నాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు గతంలో ఎంపీగా గెలిచి నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్రంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ కోసం కనీసం ఒక్క విద్యా, వైద్యాలయాన్ని ఇచ్చిందా? అని బండి సంజయ్‌ను పరోక్షంగా మంత్రి ప్రశ్నించారు. శ్రీరాముడి పేరిట, అక్షింతల పేరిట ఓట్లు అడుక్కోవడం కాదు.. అభివృద్ధి ఏంటో చెప్పి ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. తాను ఎంపీగా చేసిన అభివృద్ధిపై, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని, అందుకోసం మనవంతుగా కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించడం కోసం హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి లక్ష మెజార్టీ తీసుకొచ్చే విధంగా ప్రతి కార్యకర్త బూత్‌లెవల్‌లో కష్టపడి పనిచేయాలని కోరారు. నాలుగు మాసాల కింద చూపించిన ఉత్సాహానికి మించి ఈ 25 రోజులు కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో హుజురాబాద్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సత్యనారాయణ గౌడ్, అరెపల్లి మోహన్, వెలిచాల రాజేందర్‌రావు, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ శివయ్య, జడ్పీటీసీ గీకురు రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, దర్శయ్య, అయిలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.


దుబ్బాక మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు

అకాల వర్షం..ఆగమాగం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- నేలరాలిన మామిడి


జిల్లెగడ్డలో ఇంటి పైకప్పు లేచిపోవడంతో దిగాలుగా చూస్తున్న మహిళ

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి, శుక్రవారం కురిసిన అకాల వర్షం అన్నదాతలను ఆగమాగం చేసింది. వర్షానికి తోడు వీచిన బలమైన ఈదురుగాలులకు పంటలు, మామిడి తోటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యం తడిసిముద్దయింది.

సిద్దిపేటరూరల్/హుస్నాబాద్‌రూరల్/చేర్యాల/నారాయరావుపేట/మద్దూరు/బెజ్జంకి/మిరుదొడ్డి/దుబ్బాక/చిన్నకోడూరు, ఏప్రిల్ 19: సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు, బండ చర్లపల్లి, రావురూకాల, రాఘవపూర్, పెద్ద లింగారెడ్డిపల్లి, సీతారాంపల్లి గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరారు. హుస్నాబాద్ మండలంలో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. వరి పంట, మామిడి కాయలు నేలరాలిపోయాయి. కల్లాలోని ధాన్యం తడిసి ముద్దగా మారింది. హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో బెల్లపు సారయ్యకు చెందిన రేకుల ఇల్లు పైకప్పు లేచిపోయి ఇంట్లోని వస్తువులు తడిసి ముద్దయ్యాయి. లావుడ్య దేవయ్య, లావుడ్య రమేష్‌కు చెందిన వరిపంట నేలవాలి పోవడంతో వరిగింజలు రాలిపోయాయి. కేంద్రాల్లోని ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో మామిడితోటలు దెబ్బతిన్నాయి. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో గ్రామంలోని కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ధాన్యం తడిసిపోయింది. బలమైన ఈదురుగాలులకు గ్రామంలోని మామిడి తోటలు దెబ్బతిన్నాయి. నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామశివారులోని పలువురు రైతుల వరి చేలు నేలకొరిగాయి. నారాయణరావుపేట మండలంలో స్వల్పంగా వడగళ్లు పడ్డాయి. వర్ష సుచనలతో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అప్రమత్తమై ధాన్యంపై కవర్లు కప్పారు. మద్దూరు మండలంలో శుక్రవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గాలిదుమారం, ఉరుములు మెరుపులతో పాటు కురిసిన కొద్దిపాటి చినుకులు కలవరానికి గురి చేశాయి. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పి ఉంచారు. బెజ్జంకి మండలంలో శుక్రవారం ఈదురుగాలతో కురిసిన అకాల వర్షానికి ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో, పొలాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. మిరుదొడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసింది. మండలంలోని ధర్మారం, మిరుదొడ్డి, లక్ష్మీనగర్, లింగుపల్లి, అల్వాల్, కాసులబాద్ గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. దుబ్బాక మార్కెట్ యార్డులో దాదాపు 6వేల క్వింటాళ్ల ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. సిమెంట్ కల్లాలో ఆరబెట్టిన వెయ్యి క్వింటాళ్ల ధాన్యం పూర్తిగా కొట్టుకుపోయింది. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. అప్రమత్తమైన రైతులు వరి ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచారు. చిన్నకోడూరు పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన పొద్దుతిరుగుడు గింజల బస్తాలు కొంత మేర తడిశాయి.


మీర్జాపూర్‌లో నేలరాలిన మామిడికాయలు


చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యంరాశులు

ఆటోకార్మికుల జీవితాలను ఆగం చేసిన కాంగ్రెస్

- ఆ పార్టీకి ఓటుతో గుణపాఠం చెప్పాలి
- రెండు జాతీయ పార్టీలు ప్రజలను మోసం చేశాయ్
- ఆటో కార్మికులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 19: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మోసం, కష్టాలు అనే మాటకు నిదర్శనమని, కళ్లముందు ఆటో కార్మికుల జీవితాలు ఆగమయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేటలో శుక్రవారం ఆయన ఆటో కార్మికులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సిద్దిపేట ఆటో కార్మికుల కోసం ప్రతీ పండగకు కొత్త దుస్తులను ఇస్తానని, మీ ఇంట్లో పెళ్లయితే ఆటోలక్ష్మీ కింద రూ.5వేలు, కార్మికులు చనిపోతే రూ.2లక్షలు, పిల్లల చదువుకు సాయం.. ఇలా ఎన్నో సహాయాలను అందిస్తున్నానని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోకార్మికుల జీవితాలను ఆగం చేసిందని, సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తానని మాట తప్పిందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నెలకు రూ.10 వేలు జీవనభృతి ఇవ్వాలని అసెంబ్లీలో కొట్లాడితే నోరు మెదపలేని ఈ ప్రభుత్వాన్ని వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు అమలు చేస్తానని మోసం చేసిందన్నారు. మాయమాటలతో గద్దెనెక్కి ఆగం చేసి విర్రవీగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్లమెంటు ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 40 మంది ఆటో కార్మికులు చనిపోతే ప్రభుత్వం ఆదుకోలేదని, ఒక్క మంత్రి కానీ, ఎమ్మెల్యే కానీ పరామర్శించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరిచిందని, రూ.60 ఉన్న పెట్రోల్, డీజిల్‌ను రూ.100 చేసిందని మండిపడ్డారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు గతంలో అబద్ధాలతో దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచాడని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని అన్నారు. సిద్దిపేట అభివృద్ధిపై కండ్ల మంట పెట్టుకున్నారని, అలాంటి వ్యక్తిని మనం గెలిపించుకుందామా? ఒక్కసారి ఆలోచించాలని హరీశ్‌రావు సూచించారు.

ఎండలు భగ భగ.. వన్యప్రాణులు విలవిల

- అటవీ ప్రాంతంలో ఎండిన చెరువులు, కుంటలు
- తాగునీటి కోసం జనారణ్యంలోకి జంతువులు
- దాహార్తి తీర్చడానికి 109 సాసర్‌పిట్‌లు ఏర్పాటు.. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్స్ ఏర్పాటు


చేర్యాల మండలం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్‌పిట్ (ఫైల్)

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 19 :రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో నీడపట్టున ఉన్న జనమే అల్లాడుతున్నారు. ఇక అడవుల్లో ఉండే వన్యప్రాణుల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అవి తాగునీటి కోసం పడే తిప్పలు అన్నీఇన్నీ కావు.. ఒక్కోసారి దాహం తీర్చుకోవడానికి అడవులకు దగ్గర్లో ఉన్న పొలాల్లోకి, ఊర్లలోకి కూడా వస్తుంటాయి. అయితే వాటి దాహార్తి తీర్చడానికి సంబంధితశాఖ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. జిల్లాలో సుమారు 50వేల ఎకరాల అటవీ ప్రాంతం ఉంది. సుమారు 600 వరకు వన్యప్రాణులు ఉన్నాయి. ఎక్కువగా నెమళ్లు, కుందేళ్లు, జింకలు, ఎలుగుబంట్లు, నక్కలు, అడవిగొర్రెలు, వివిధ రకాల పక్షులున్నాయి. అడవి ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలు ఎండిపోవడంతో నీరు దొరక్క అవి అల్లాడుతున్నాయి. వీటి దాహార్తిని తీర్చడానికి 109 సాసర్‌పిట్(తాత్కాలిక నీటి కుంట)లను ఏర్పాటు చేశారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి వాటిని నింపుతున్నారు.




వేములఘాట్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఫైర్‌లైన్ (ఫైల్)

అటవీశాఖ, బ్లూ కోర్ట్ సిబ్బంది పెట్రోలింగ్

వేసవిలో అధిక ఉష్ణోగ్రతలకు తాళలేక కొన్ని వన్యప్రాణులు గ్రామాల్లోకి, రోడ్లపైకి వచ్చి ప్రమాదాలకు గురవుతుంటాయి. మరికొన్ని వేటగాళ్లకు చిక్కుతుంటాయి. వన్యప్రాణులు ప్రమాదాల బారిన పడకుండా అడవిలో ప్రతిరోజూ బ్లూ కోర్ట్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఎక్కువగా వన్యప్రాణులు రోడ్లపైకి వచ్చే ప్రాంతాల్లో తిరుగుతూ వాటిని కాపాడుతున్నారు. 20 రోజుల క్రితం తొగుట మండలం ఘణపురంలో ఎండవేడి తట్టుకోలేక ఓ జింక గ్రామంలోని బావి వద్దకు వచ్చి ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే రిస్క్యూ టీమ్‌ను పంపించి జింకను కాపాడి అడవిలో వదిలేశారు.

ఫైర్‌లైన్స్ ఏర్పాటు

అటవీ ప్రాంతంలో రైతులు, మరికొందరు చేసే నిర్లక్ష్యపు పనులతో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. ఎండిన గడ్డి చాలా దూరం వరకు కలిసి ఉండడంతో అక్కడ అగ్నిప్రమాదం జరిగితే మంటలు వ్యాప్తించకుండా గడ్డిని విభాగాలుగా విభజిస్తున్నారు. వాటినే ఫైర్‌లైన్స్ అంటారు. జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేసి అగ్నిప్రమాదల నివారణకు, వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

- శ్రీనివాస్, జిల్లా అటవీ శాఖ అధికారి

ఎండ తీవ్రత అధికంగా ఉండడం వల్ల వన్యప్రాణులకు నీటికొరత ఏర్పడింది. జిల్లా మొత్తంలో 50వేల ఎకరాల్లో అటవీ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో ఎక్కడా కూడా వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. చెరువులు, కుంటలు ఎండిపోయిన చోట తాత్కాలిక నీటికుంటలను ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నాం. అగ్నిప్రమాదాల నివారణకూ చర్యలు తీసుకుంటున్నాం.

సిద్దిపేట జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

ములుగు, ఏప్రిల్ 19: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా ములుగు మండలం క్షీరాసాగర్ గ్రామానికి చెందిన నల్ల శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావును శుక్రవారం హైదరాబాద్‌లో శ్రీనివాస్ కలిసి సన్మానించారు.

అందోలు బీఆర్ఎస్‌కు భారీ షాక్

● బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీలోకి వలసలు

జోగిపేట, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల వేళ అందోలు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీకి భారీ నష్టం కలగనున్నది. ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనుండగా, మరికొందరు బీజేపీ గూటికి చేరనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో దామోదర్ రాజనర్సింహ భారీ విజయం సాధించి, మంత్రి పదవి పొందాక పలువురు బీఆర్ఎస్ నాయకులు, అందోలు-జోగిపేట మున్సిపల్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరేందుకు ఉత్సుకత చూపించినా దామోదర్ ప్రోత్సహించలేదు. గత నెలరోజులుగా కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల నేపథ్యంలో మంత్రి దామోదర్ తన శైలికి భిన్నంగా ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర లేపారు. చేరికల విషయంలో దామోదర్ నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో తనకు నమ్మకంగా పని చేసిన కాంగ్రెస్ నాయకుల వార్డుల్లో వారికి ఇబ్బంది అనిపించే నాయకులెవరినీ కాంగ్రెస్‌లో చేర్చుకోవడానికి ఇష్ట పడడం లేదు. ప్రజల్లో పెద్దగా ప్రజాదరణ లేని నాయకులను కూడా చేర్చుకోవడం లేదు.

కాంగ్రెస్‌లో చేరే నేతలు వీరే..

అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్ మేతరి ప్రవీణ్, కౌన్సిలర్లు పిట్ల భాగ్యలక్ష్మిలక్ష్మణ్ దంపతులు, పడిగె సుమిత్రాసత్యం దంపతులు కాంగ్రెస్‌లో చేరేందుకు దామోదర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాయికోడ్ మండలానికి చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధన్నపాటిల్, జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్ కూడా కాంగ్రెస్‌లో చేరనున్నారు. సంగారెడ్డిలోని మంత్రి దామోదర్ నివాసంలో శనివారం కాంగ్రెస్‌లో చేర్చుకోనున్నారు.

బీజేపీ గూటికి ఇద్దరు కౌన్సిలర్లు

ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు బీజేపీలో చేరనున్నారు. అందోలు మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల ధనలక్ష్మిఅనిల్‌కుమార్ దంపతులు, పులుగు లక్ష్మీబాయికిష్టయ్యతో పాటు ఆమె కుమారుడు పులుగు గోపాల్‌రావు బీజేపీలో చేరనున్నారు. ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో శనివారం బీజేపీలో చేరనున్నారు.

మోదీ చేతుల్లోనే దేశ భవిష్యత్తు

● బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు



నంగునూరు మండలం కోనాయిపల్లిలో వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్న రఘునందన్‌రావు

నంగునూరు, ఏప్రిల్ 19: దేశ అభివృద్ధి నరేంద్ర మోదీతోనే సాధ్యమవుతుందని మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయపల్లి, తిమ్మాయపల్లి, భాషగూడెం, నర్మేట, నంగునూరు గ్రామాల్లో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ నేతలు రైతుల నుంచి వందల ఎకరాల భూమి లాక్కున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికలు కేసీఆర్‌కు, హరీశ్‌రావుకు సంబంధించిన ఎన్నికలు కావన్నారు. కేంద్రంలో బీజేపీ గెలిస్తేనే దేశం అభివృద్ధి చెందడంతో పాటు మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కేసీఆర్ కూతురు లిక్కర్ దందా చేసి జైలుకెళ్లిందని విమర్శించారు. నంగునూరు మండలంలో హరీశ్‌రావు పామాయిల్ తోటలు తప్ప అభివృద్ధి చేసింది ఏమీ లేదని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నందునే సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి వరకు నేషనల్ హైవేను ఏర్పాటు చేశారని, సిద్దిపేటకు రైలు తీసుకువచ్చిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కులం పేరు చెప్పుకుంటూ ఓట్ల కోసం ముందుకు వస్తున్నారని విమర్శించారు. కులాల ప్రతిపాదికన బీజేపీ ముదిరాజులకు మూడు సీట్లు ఇచ్చిందన్నారు. అంతకు ముందు కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో రఘునందన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు దూది శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, నాయకులు రజనీకర్‌రెడ్డి, పేరాల తిరుపతిరావు, వాసర యాదమల్లు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రచార రథం.. ఒకరి మృతి

గజ్వేల్, ఏప్రిల్ 19: ట్రాక్టర్‌ను ప్రచార రథం ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడకు చెందిన సొక్కి మల్లేశం(43) శుక్రవారం తన ట్రాక్టర్‌ను నడుపుకుంటూ ప్రజ్ఞాపూర్ వైపు వెళ్తుండగా వెనకాల నుంచి వచ్చిన ఓ పార్టీకి చెందిన ప్రచార రథం ఢీకొట్టింది. ప్రమాదంలో మల్లేశం అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లేశంకు భార్య కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు. ప్రచార రథం డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గజ్వేల్‌లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకువస్తాం

● సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్/ములుగు/జగదేవ్‌పూర్ ఏప్రిల్ 19: గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకువస్తామని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామానికి చెందిన చిమ్మిరెడ్డి ఆధ్వర్యంలో 50మంది బీఆర్‌ఎస్ నాయకులు, క్యాసారం గ్రామానికి చెందిన కప్ప కిషోర్, గజ్వేల్ పట్టణానికి చెందిన సూరజ్‌లు శుక్రవారం నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు నెంటూరుకుమార్, పొట్ట కరుణాకర్, మోహన్నగారి రాజు, క్యాసారం బాబ, సొక్కం సురేశ్ తదితరులున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేశిరెడ్డి రవీందర్‌రెడ్డి, ధర్మారం మాజీ సర్పంచ్ బత్తుల మల్లేశం యాదవ్, పైతర నరసింహారెడ్డి, అమరేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌రాజు, కృష్ణ, రాజు, రవి, కిషన్, ప్రభాకర్, స్వామి, రాజు ఆధ్వర్యంలో నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తన అనుచరులతో కలసి శుక్రవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.



గజ్వేల్‌లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ భాస్కర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మైనంపల్లి హనుమంతరావు, నర్సారెడ్డి

ములుగు మండలానికి చెందిన జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌సలీంతో పాటు మరికొంత మంది శుక్రవారం బీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుముదిరాజ్‌కు భారీ మెజార్టీని తీసుకురావాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, నాయకులు నిరుడి ఇస్తారి, గుంద్ర నర్సింహులు, సల్ల శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, గాడిపల్లి అనూప్, కన్నాయాదవ్, సంగాపూర్ ఇక్బాల్, పెద్దింటి భానుప్రసాద్, రాజేశం, ప్రేమ్‌కుమార్, సబ్బని నరేశ్, కుమార్‌లు కాంగ్రెస్‌లో చేరారు. వారి వెంట తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రావు, సయ్యద్ మతీన్, సర్దార్‌ఖాన్, శివరాంరెడ్డి, మల్లారెడ్డి, మోహన్నగారి రాజు, నక్క రాములు, జంగం రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి

రానున్న లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషిచేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, మెదక్ పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జి బండారు శ్రీకాంత్‌రావు పిలుపునిచ్చారు. గజ్వేల్ మండలం జాలిగామలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయగా, ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుని అఖండ మెజార్టీతో గెలిపించే బాధ్యత మనందరిపై ఉందని అన్నారకు. వారితో తీగుల్ మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాశ్‌రావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపాక విజయ్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాచకొండ ప్రశాంత్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వడ్ల కొండ రవీందర్, శ్రావణిరెడ్డి, పరుశరాములు, మండల నాయకులు రవి, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, కపిల్, కార్యదర్శి భాను పాల్గొన్నారు.



చేర్యాల: సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత నాగపురి కిరణ్‌కుమార్



గజ్వేల్ మండలం జాలిగామలో సమావేశంలో మాట్లాడుతున్న బండారు శ్రీకాంత్‌రావు

ఎమోషనల్ డ్రామా పనిచేయదు

చేర్యాల, ఏప్రిల్ 19 : తాను బీసీ బిడ్డనని, సామాజిక వర్గం పేరిట బీజేపీ భువనగిరి అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ మొసలికన్నీరు కారుస్తూ, చేస్తున్న ఎమోషనల్ డ్రామా ఎంత మాత్రం పనిచేయదని కాంగ్రెస్ నేత నాగపురి కిరణ్‌కుమార్ అన్నారు. చేర్యాల పట్టణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎంపీగా అవకాశం కల్పించినప్పటికీ, ఎలాంటి అభివృద్ధికి చేయకపోగా, ఒక్క బీసీ నేతనైనా తయారు చేయలేదని విమర్శించారు. చేర్యాల, జనగామ ప్రాంత ప్రజలతో అనుబంధం కలిగిన ఆయన తండ్రి రాజకీయానుభవంతో, దళితుడిని కొమురవెల్లి మల్లన్న ఆలయ చైర్మన్ చేయడంతో పాటు ఎంతోమంది బీసీ, ఎస్సీ నేతలను తయారు చేశారన్నారు. రాజకీయ స్వార్థంతో వ్యవహరించే బూర నర్సయ్యగౌడ్‌కు తమ కుటుంబం గురించి ప్రస్తావించే అర్హత లేదన్నారు. ఈనెల 21వ తేదీన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలుకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు.

బీఆర్‌ఎస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు

కొండపాక, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు గుణపాఠం తప్పదని కాంగ్రెస్ కొండపాక మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ అన్నారు. శుక్రవారం కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలు పేద, బడుగు బలహీన వర్గాల వారికి అండగా నిలుస్తున్నాయన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో విసుగు చెందిన తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కేంద్రంలో బిజెపి పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, నిరుద్యోగ సమస్య తీర్చ లేదన్నారు. ఈ రెండు పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆటో.. ఒకరి మృతి

కొండపాక/చేర్యాల, ఏప్రిల్ 19: స్కూటీని ఆటో ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగింది. జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన సందెల అశోక్(65) స్కూటీపై సిద్దిపేటకు బయలుదేరాడు. వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న ఆటో ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ షోరూం ఎదుట మృతుడి కుటుంబీకుల ఆందోళన

చేర్యాలలోని ఓ బైక్ షోరూం వద్ద మృతదేహంతో ఆందోళనకు దిగారు. సందెల అశోక్ ఇటీవల పట్టణంలోని వైష్ణవి షోరూంలో ద్విచక్రవాహన్నాన్ని కొనుగోలు చేశారు. ఇన్సూరెన్స్ డబ్బులు కూడా చెల్లించారు. కానీ షోరూం నిర్వాహకులు ఎలాంటి పత్రాలు లేకుండానే వాహనాన్ని అందించారు. ఇన్సూరెన్స్ వర్తించకపోవడంతో మృతుడి కుటుంబీకులు మృతదేహంతో చేర్యాలకు చేరుకున్నారు. ఆ సమయంలో షోరూం బంద్ చేయడంతో ఆందోళనకు దిగారు. షో రూం నిర్వాహకులు కొంతమేర పరిహారం చెల్లింపునకు అంగీకరించారు. మృతుడి కుమారుడు రామ్ చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేసి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

బేగంపేటలో రైలు ఢీకొని వ్యక్తి మృతి



నర్సింహులు (ఫైల్)

రాయపోల్, ఏప్రిల్ 19: రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన సంఘటన రాయపోల్ మండలం బేగంపేట శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట గ్రామానికి చెందిన మంగలి నర్సింహులు(50) తన ముగ్గురు కూతుళ్లకు పెళ్లిల్లు చేశాడు. బేగంపేటలో సెలూన్ షాప్ నడుపుకుంటూ భార్యతో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం తన పొలం వద్ద గేదెలకు నీళ్లు తాగించడానికి తీసకెళ్తున్న క్రమంలో రైల్వే పట్టాలపై ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. అదే సమయంలో వచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సికింద్రాబాద్ అల్వాల్ రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

బంక్ ఎదుట ఉన్న విద్యుత్ స్తంభం తొలగింపు



విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న టోల్‌గేట్ సిబ్బంది

కుకునూరుపల్లి, ఏప్రిల్ 19: 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనానికి దుద్దెడ హెచ్.కె.ఆర్ టోల్‌గేట్ యాజమాన్యం స్పందించింది. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని హిందుస్థాన్ పెట్రోల్ బంక్ ఎదుట డివైడర్ మధ్యలో వంగిపోయి ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని తొలగించారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలి

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మహిళా రైతులు ఓదార్చుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఏప్రిల్ 19: దుబ్బాక మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మిల్లర్లు కూడా రైతుల పట్ల సానుకూలంగా ఉండి, ధాన్యం తూకం అయ్యే విధంగా సహకరించాలన్నారు. ధాన్యం రంగుమారినా తేమ విషయంలో పట్టింపులేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. రైస్‌మిల్లర్లు, అధికారులతో సమీక్ష జరిపి రైతులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. టార్పాలిన్లు, గన్నీసంచులు వెంటనే సమకూర్చాలని కోరారు. ఆయన వెంట సీనియర్ నాయకులు ఆర్.రాజమౌళి, ఆస యాదగిరి, ఆస స్వామి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కొత్త కిషన్‌రెడ్డి, మల్లేశంగౌడ్ తదితరులున్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 19: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి.సురేష్‌కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేట పట్టనంలోని ఓ షాపింగ్ మాల్, బాలాజీ థియేటర్, ఇతర రద్దీ ప్రదేశాల్లో శుక్రవారం అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. బహుళ అంతస్తుల ప్రదేశాల్లో పనిచేస్తున్న సిబ్బంది అగ్నిమాపక సాధనాలను ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలని చెప్పారు. రాత్రి సమయంలో షాపుల్లో విద్యుత్ ఆఫ్ చేసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర ఇన్‌చార్జి కె.నరేష్, ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ఫుట్‌బాల్ టీం కెప్టెన్‌గా సాయియశ్వంత్



సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 19: తెలంగాణ ఫుట్‌బాల్ అండర్-20 టీం కెప్టెన్‌గా సిద్దిపేటకు చెందిన పిట్ల సాయి యశ్వంత్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. యశ్వంత్ సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ కోచ్ అక్బర్ నవాబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న సిద్దిపేట ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఓనమాలు నేర్చుకున్నాడు. సిద్దిపేట నుంచి యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని ఓ ఫుట్‌బాల్ క్లబ్‌కు ఆడుతున్న యశ్వంత్ తెలంగాణ రాష్ట్ర అండర్-20 టీంకు కెప్టెన్‌గా నియమితులయ్యారు. దీంతో సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు.

జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలు

వర్గల్, ఏప్రిల్ 19: వర్గల్ కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం క్రీడా పోటీలను ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు ప్రారంభించారు. క్రీడా పోటీల్లో మొదటిసారి క్రికెట్‌ను చేర్చారు. 20 మందికి సొసైటీ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్‌ను అందించారు. విజేతలకు మే మొదటి వారంలో నిర్వహించే వార్షికోత్సవంలో బహుమతులు అందజేస్తామని కళాశాల పీడీయం లోకేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గోవందరావు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ఒప్పించగల సత్తా పీఆర్‌టీయూ సొంతం

వర్గల్, ఏప్రిల్ 19: ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి, మెప్పించగల సత్తా ఉన్న ఏకైక సంఘం పీఆర్‌టీయూ అని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం వర్గల్ మండలం శాఖారంలో నిర్వహించిన పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు ముచ్చంతుల భాస్కర్‌రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభలో ఎమ్మెల్సీ మాట్లాడారు. మూడు దశాబ్దాలకు పైగా అంకిత భావంతో మండల శాఖ బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆయన ఉద్యోగ విరమణ సంఘానికి తీరని లోటన్నారు. అనంతరం భాస్కర్‌రెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, మండల శాఖ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, మండల విద్యాధికారి సునీత, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నర్సింహ్మారెడ్డి, సంఘం మండల నాయకులు శ్రీనివాస్, గాయత్రి, నర్సింహ్మారెడ్డి, రజనితో తదితరులు ఉన్నారు. భాస్కర్‌రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభకు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి హాజరై భాస్కర్‌రెడ్డి దంపతులను సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రంగారెడ్డి, మోహన్, తోట ముత్యాలు తదితరులు ఉన్నారు.

భువనగిరికి తరలిన సీపీఎం శ్రేణులు

చేర్యాల, ఏప్రిల్ 19: సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి జహంగీర్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈసందర్భంగా సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ నాయకుడు అందె బీరయ్య సంపూర్ణ మద్దతు పలుకుతూ వారి నామినేషన్‌కు తరలివెళ్లారు.

బెల్టుషాప్‌పై పోలీసుల దాడి, కేసు నమోదు

గజ్వేల్, ఏప్రిల్ 19: గజ్వేల్ మండలం కొడకండ్లలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నారన్న సమాచారంతో సిద్దిపేట జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కుకునూరుపల్లి పోలీసులు దాడి చేసి, గ్రామానికి చెందిన శ్రీనివాస్ కిరాణా దుకాణంలో 22.475 లీటర్ల బీరు, విస్కీని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వర్గల్‌లో వైద్య శిబిరం

వర్గల్, ఏప్రిల్ 19: వర్గల్ కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో హెల్త్ సూపర్‌వైజర్ ఉమారాణి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్వీఎం ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, ఆర్వీఎం ఆస్పత్రి వైద్యబృందం వంశీ, అరుణ, జగదీష్ ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

మిరుదొడ్డి ,ఏప్రిల్ 19: మండలంలోని మల్లుపల్లి గ్రామంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ కనకరాజు తల్లీతండ్రులు లక్ష్మి, ఎల్లయ్యల జ్ఞాపకార్థం గ్రామంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

● జిల్లా పంచాయతి అధికారి దేవకిదేవి



మిరుదొడ్డిలో మాట్లాడుతున్న డీపీవో దేవకిదేవి

మిరుదొడ్డి/చేర్యాల ఏప్రిల్ 19: గ్రామాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలను తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి అధికారులకు సూచించారు. శుక్రవారం మిరుదొడ్డి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో నీటికొరతపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేసి, తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. తీవ్రనీటి కొరత ఉన్న గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎంపీవో జహీరోద్దీన్, మిషన్‌భగీరథ ఏఈ రోహిత్, మిరుదొడ్డి పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ఫాహిమ్ ఉన్నారు.

వేసవిదృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ప్రత్యేకశ్రద్ధ వహించాలని చేర్యాల మండల ప్రత్యేకాధికారి శివాజీ సూచించారు. చేర్యాల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్‌అలీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో వేసవి నీటిఎద్దడి నివారణ చర్యలు, ఉపాధిహామీ పనుల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో ఉపాధిహామీ ఏపీవో మంజుల, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ దివ్య పాల్గొన్నారు.

వెంచర్లలో హద్దురాళ్ల తొలగింపు

కొండపాక, ఏప్రిల్ 19: కొండపాక మండలం దుద్దెడ, వెలికట్ట శివారులో అనుమతి లేకుండా వేసిన వెంచర్లలో, హద్దు రాళ్లను అధికారులు శుక్రవారం తొలగించారు. ఎంపీవో వీరరాజు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రాళ్లను తొలగించారు. అనుమతి లేకుండా వెంచర్లు వేయడం చట్ట విరుద్ధమని, ఎలాంటి అనుమతి లేకుండా ఉన్న అక్రమ వెంచర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

● హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి

అక్కన్నపేట/ములుగు ఏప్రిల్ 19: ఎన్నికల కోడ్ అమలు ఉన్న నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోసు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం ఇతరత్రా తరలించే వారిపై నిఘాను పెంచామన్నారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సంజీవ్ కుమార్, ఎస్ఐ తాండ్ర వివేక్, తదితరులున్నారు.

జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సిన బాధ్యత అధికారులదేనని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం ములుగు మండలం వంటిమామిడి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి, విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి ఆధారాలు లేని నగదు కాని, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువుల రవాణాను అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు చేపట్టమని తెలిపారు. ఆయన వెంట ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.



వంటిమామిడిలో చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

ఉపాధిహామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలి

● డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్



అక్కారంలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

గజ్వేల్/జగదేవ్‌పూర్ ఏప్రిల్ 19: ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలని, వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం 11లోపు పనులు పూర్తి చేసుకోవాలని, ఇంటి నుంచి మంచినీటిని తీసుకువెళ్లాలని గజ్వేల్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన గజ్వేల్ మండల పరిధిలోని అక్కారం గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శుభ్రమైన నీటిని తాగాలని, ఎండలో ఎక్కువసేపు ఉండొద్దన్నారు. ఎవరికైనా కండ్లు తిరిగి చెమటలు పట్టడం, శ్వాస ఆడకపోవడం లాంటి సమస్యలు కనిపిస్తే వెంటనే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని అందించాలన్నారు. వారివెంట గ్రామ ప్రత్యేకాధికారి షేక్ ఆరీఫా, శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బల్బీర్‌సింగ్, శ్రీనివాస్, సబ్‌యూనిట్ అధికారి శ్రీదేవి, నాగమణి ఉన్నారు.

ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు డీఆర్డీవో బాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని బిజి వెంకటాపూర్‌లో ఆయన ఉపాధి హామీ పనులను, నర్సరీలను పరిశీలించారు. మునిగడపలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో శ్రీనివాస్‌వర్మలు ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలని సూచించారు. కూలీలు ఉదయం 7 గంటలకు పనిలో చేరి 10 గంటలకు పని పూర్తి చేసుకుని వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

● హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి



అక్కన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న ఆర్డీవో రామ్మూర్తి

అక్కన్నపేట/మద్దూరు ఏప్రిల్ 19: రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తున్నారని హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విశాల పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేసి, అందుబాటులో ఉన్న వాహనాల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సంజీవ్‌కుమార్ ఉన్నారు.

రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని రేబర్తి గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి చంద్రం, ఐలయ్య పాల్గొన్నారు.

ఇసుక డంపు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక డంపుతో పోలీసులు

బెజ్జంకి, ఏప్రిల్ 19: మండలంలోని తోటపల్లి గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుక డంపును రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసిన, నిల్వ చేసిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కృష్ణారెడ్డి హెచ్చరించారు.

వ్యాయామం దినచర్యలో భాగం..

● గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా

గజ్వేల్, ఏప్రిల్ 19: యువత వ్యాయామాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలో ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 3కే రన్ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వారితో ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ గోపాల్, వైస్ ప్రెసిడెంట్ వినోద్, సామాజిక కార్యకర్త దేశబోయిన నిర్సంహులు, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, పిరమిడల్ సొసైటీ ప్రతినిధి నర్సింహులు, ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి స్వామి, ఫౌండేషన్ సభ్యులు అక్బర్, వెంకట్, విజయ్, కరుణాకర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిన మాజీ సర్పంచులు

అక్కన్నపేట, ఏప్రిల్ 19: మండలానికి చెందిన 6 గురు బీఆర్‌ఎస్ తాజా మాజీ సర్పంచులు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గుగులోతు తిరుపతినాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో దుబ్బతండా తాజా మాజీ సర్పంచ్ మాలోతు రాజునాయక్, కేశనాయక్‌తండా తాజా మాజీ సర్పంచ్ బానోతు రవీందర్, మల్చెరువుతండా తాజా మాజీ సర్పంచ్ భూక్య మల్లేష్‌నాయక్, నందారం తాజా మాజీ సర్పంచ్ లింగాల ఎల్లయ్య, మైసమ్మవాగుతండా తాజా మాజీ సర్పంచ్ సందెబోయిన లావణ్య-కుమార్, మంచినీళ్లబండ తాజా మాజీ సర్పంచ్ ఇటికాల కవిత-కుమార్ ఉన్నారు. ఇందులో బీజేపీ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, తదితరులు ఉన్నారు.

కనుల పండువగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

బెజ్జంకి, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని ఏకశిలా గుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ముత్యాల పందిరిలో అర్చకులు భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు ఆలయ ఈవో విశ్వనాథశర్మ సమర్పించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఆలయం ముస్తాబు

చిన్నకోడూరు, ఏప్రిల్ 19: అష్టమ వార్షికోత్సవాలకు మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం ముస్తాబైంది. ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు గీత పారిశ్రామిక గౌడ సంఘం సభ్యులు తెలిపారు.

ప్రజ్ఞాపూర్‌లో ప్రారంభమైన ప్రతిష్ఠ మహోత్సవాలు

గజ్వేల్, ఏప్రిల్ 19: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ముత్యాలమ్మ, నల్లపోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జాలాధివాసం, మూలమంత్ర హోమములు, ప్రదోశపూజ, మంగళహారతి నిర్వహించారు.



బెజ్జంకిలో లక్ష్మీ సమేత నరసింహస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామంలో గ్రామ దేవతల ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పూజారి ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ప్రతిష్ఠ మహోత్సవాలను గణపతి పూజతో ప్రారంభించారు. నేటితో మొదలై వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి.

గజ్వేల్ పట్టణంలో ఈ నెల 23న నిర్వహించనున్న వీర హనుమాన్ శోభాయాత్రకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఆయన తనయుడు ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు ఎన్‌సీ సంతోష్‌కుమార్ గుప్తాలు రూ.30వేలు విరాళం ఇచ్చారు. వీరహనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని, ప్రతి ఒక్కరూ పాల్గొన్నాలని చైర్మన్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.